ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 9
సంచిక : 13
పేజీలు : 3
శుక్రవారం, ఆగస్టు 01, 2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## జులైలో 86% బొగ్గు ఉత్పత్తి

**-మీడియా సమావేశంలో జిఎం**




**టి మీడియా, జూలై 31, పినపాక ప్రతినిధి:** సింగరేణి మణుగూరు ఏరియాలో జూలై నెలలో 86 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జులైలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 7 లక్షల58వేల 500 టన్నులకు గాను,6 లక్షల 51వేల 331 టన్నులు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏరియా ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్, రక్షణ అధికారి వెంకట రామారావు, ఏ జి ఎం సిహెచ్ రాంబాబు, డీజీఎం (పర్సనల్) ఎస్ రమేష్, డీజీఎం (ఫైనాన్స్) అనురాధ, డి వై సి ఎం ఓ జ్యోతిర్మయి, డీజీఎం (సివిల్) శివప్రసాద్, సెక్యూరిటీ అధికారి కె శ్రీనివాస్, పర్యావరణ అధికారి జె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

# నిబంధనలకు లోబడి
# లేఔట్ అనుమతులు

- **మున్సిపల్ కా కార్యాలయంలో కమిటీ సమావేశం**



**టీ మీడియా, జులై 31,ఖమ్మం:** పారదర్శకంగా నిబంధనలకు లోబడి లేఔట్ అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం నిర్వహించిన లేఔట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పాల్గొన్నారు.పెండింగ్ ఉన్న లేఔట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, ప్రతి లే అవుట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న దరఖాస్తుల ప్రాంతాలను గూగుల్ ఎర్త్ వినియోగిస్తూ కలెక్టర్ గతంలో అక్కడ ఏమైనా నీటి వనరులు ఉన్నాయా వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలేఔట్ అనుమతులు మంజూరు చేసే సమయంలో నియమ, నిబంధనలు క్షేత్ర స్థాయిలో అనుసరించేలా చూడాలని అన్నారు. నిబంధనల మేరకు ఓపెన్ స్పేస్ తప్పని సరిగా లేఔట్ ఏరియాలో ఉండాలని, లేఔట్ లో గ్రీనరీ చెట్ల పెంపకానికి కేటాయింపులు జరగాలని అన్నారు. లేఔట్ కు అప్రోచ్ రోడ్డు, అంతర్గత రోడ్లు ఉండాలని అన్నారు. లేఔట్ లో స్ట్రీట్ లైట్స్, సీవరేజి వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, ఫైర్ సేఫ్టీ చర్యలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ లలో అనుమతులు జారీ చేయడం కుదరదని కలెక్టర్ స్పష్టం చేశారు. లేఔట్ ప్రాంతంలో గతంలో ఏమైనా నీటి వనరులు ఉన్నాయా అని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా సాంకేతికతను వినియోగిస్తూ పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని, మనం జారీ చేసిన అనుమతుల లోని నిబంధనలను అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారా లేదా రెగ్యులర్ పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ లకు డ్రాఫ్ట్ అనుమతులు జారీ చేసిన తర్వాత విద్యుత్ స్తంభాల తరలింపు కోసం ఎన్.పి.డి.సి.ఎల్ డిమాండ్ నోటీస్ అందించాలని, వారం రోజుల వ్యవధిలోగా చెల్లింపులు పూర్తి చేయాలని లేని పక్షంలో డ్రాఫ్ట్ అనుమతులు ఉప సంహరించాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ డెవలపర్లు విద్యుత్ స్తంభాల తరలింపుకై చెల్లింపులు చేసిన వారం రోజుల వ్యవధిలోగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని, దీనిపై ప్రత్యేకంగా ఎన్.పి.డి.సి.ఎల్ ఎస్.ఈ కు లేఖ రాయాలని అన్నారు. విద్యుత్ స్తంభాల తరలింపు ఆలస్యం కావడం వల్ల లేఔట్ తుది అనుమతులు జారీ పెండింగ్ లో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. డి.ఎల్.సి కమిటీ లో ఉన్న ఎస్.ఈ. స్థాయి అధికారులు స్వయంగా ధృవీకరించిన డాక్యుమెంట్స్ మాత్రమే సమావేశానికి తీసుకొని రావాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఇక నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి డి.ఎల్.సి. సమావేశం నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, సుడా సిపిఓ., పంచాయతీ రాజ్ ఈ.ఈ. మహేష్, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, ఇరిగేషన్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, సంబంధిత జిల్లా అధికారులు,పాల్గొన్నారు.



## కట్టలేరులో ముగ్గురు గల్లంతు

**టీ మీడియా, జులై 31,ఎర్రుపాలెం :** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల పరిధిలోని బంజర గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చేపల వేటకు వెళ్లి కట్టలేరు నదిలో గల్లంతైన సంఘటన గురువారం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. బంజర కు చెందిన 9 మంది వ్యక్తులు మీనవోలు బ్రిడ్జి సమీపంలోని కట్టలేరులో చేపలు పట్టేందుకు మధ్యాహ్నం 3 గంటల సమయంలో నదిలోకి దిగగా అందులో ముగ్గురు వ్యక్తులు బాదావత్ రాజు (55), భూక్యా కోటి (46), భూక్యా సాయి (25) కట్టలేరు లోతు తెలియకపోవడంతో పాటుగా ఈత రాక నీటి ప్రవాహంలో గల్లంతయ్యారు.తోటి వ్యక్తులు వీరిని రక్షించేందుకు ప్రయత్నించి విఫలమవడంతో స్థానిక అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఏసీపీ రెహ్మాన్, తాసీల్దరా ఎం. ఉషా శారద, సీఐ మధు, ఎస్ఐ రమేశ్ లు ఫైర్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలను చేపట్టారు.

## చంద్రు తండాలో పర్యటించిన డిఎంహెచ్ఓ

**టీ మీడియా, జులై 31, పాలేరు ప్రతినిధి** :తిరుమలాయపాలెం మండలం చంద్రు తండా గ్రామపంచాయతీలో డెంగు కేసులు నమోదు అయిన నేపథ్యంలో డి ఎం హెచ్ ఓ కళావతి భాయ్ ఆ గ్రామాన్ని పరిశీలించి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ వ్యాధికి కారణమైన దోమలని అరికట్ట వచ్చని అన్నారు గత వారం రోజులుగా గ్రామంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును పరిశీలించారు.ఈ సందర్భంగా సుబ్లేడ్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. వసుంధర నుంచి ప్రజలకు అందుతున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.డెంగ్యూ ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన డిఎం హెచ్ఓ జ్వరంతో బాధపడుతున్న వారందరి రక్త నమూనాలు సేకరించాలని అలాగే గ్రామంలో దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ట్యాంకులో క్లోరినేషన్, వాటర్ లీకేజీలను సమీక్షించాలని,వర్షాకాలంలో ప్రజలు కాచి,వడకట్టి చల్లార్చిన నీటినే సేవించాలని సూచించారు.ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో డిపిఓ దుర్గ డాక్టర్ బి.వసుంధర ఈఎంఓ వెంకటేశ్వర్లు హెచ్ ఈ ఓ వెంకటరెడ్డి సూపర్వైజర్ వెంకటేశ్వర్లు ,ఏఎన్ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



## సమాచార హక్కు చట్టం -ప్రాథమిక హక్కు

- **జవాబుదారీ తనంగా అధికారులు ఉండాలి..**
- **కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి**

**టీ మీడియా,జులై31,పాల్వంచ:** సమాచార హక్కు ప్రజల ప్రాథమిక హక్కు అని, ప్రజల హక్కును కాపాడటానికి అధికారులు ప్రజలకు ప్రభుత్వానికి జవాబు దారితనంగా వారధిలా నిలువాలని సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సమాచార హక్కు చట్టం ( ఆర్టీఐ ) అమలు పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రధాన కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి, సహ కమిషనర్లు దేశాల భూపాల్ మరియు పి.వి. శ్రీనివాస్ రావు గురువారం జిల్లాకు విచ్చేశారు. జిల్లాకు విచ్చేసిన కమిషనర్లకు ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మరియు జిల్లా ట్రైనింగ్ కలెక్టర్ సౌరబ్ శర్మ పూల మొక్కలు ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం ప్రధాన కమిషనర్ బోరేటి అయోధ్య రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఐ డి ఓ సి కార్యాలయం ప్రాంగణంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కమిషనర్లు మొక్కలు నాటారు.జిల్లాలో సమాచార హక్కు చట్టం కమిషనర్ల పర్యటన నేపథ్యంలో ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరం లో ఆర్.టి.ఐ యాక్ట్ అమలు చేయు విధివిధానాలపై క్షుణ్ణంగా పౌర సమాచార అధికారులకు చట్టనిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు రాష్ట్ర ముఖ్య పౌర సమాచార కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి మరియు ఇతర కమిషనర్లు పి.వి శ్రీనివాసరావు, దేశాల భూపాల్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీఐ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన మొదటిసారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రావడం జరిగిందని సమాచార హక్కు చట్టం




అవగాహన సదస్సు ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్ మరియు వివిధ శాఖల అధికారులు చూపించిన చొరవ హర్షించదగ్గ విషయం అని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్టీఐ సమర్ధవంతంగా అమలవుతుందన్నారు. సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, అవినీతి నిర్మూలన లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చింది అన్నారు. గత పది సంవత్సరాల కాలంలో సమాచార కమిషనర్ అందుబాటులో

మిగతా 3లో

# హైహైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి



**టీ మీడియా, జులై 31,కొత్తగూడెం :** సింగరేణిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్/కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో అమలులో ఉన్న హై పవర్ కమిటీ వేతనాలను తక్షణమే అమలు చేయాలని ఏబీకేఎంఎస్ కార్యదర్శి, వేజ్ బోర్డు సభ్యుడు పి.మాధవ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం రుద్రంపూర్ సిఎస్‌పిలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నర్సింగరావు పిట్ సెక్రెటరీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, స్టాండర్డైజేషన్ కమిటీ సభ్యుడు టీఎస్.పవన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పి.మాధవ నాయక్ మాట్లాడుతూ.. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ యూనియన్‌లో నూతనంగా చేరిన రాజేశ్, గుమ్మడి కృష్ణమూర్తికి హార్దిక స్వాగతం పలికారు. ప్రస్తుతం కోల్ ఇండియాలో అన్‌స్కిల్డ్ కార్మికుడికి రూ.1,285, సెమీస్కిల్డ్‌కు రూ.1,317, స్కిల్డ్ కార్మికుడికి రూ.1,383 చొప్పున రోజువారీ వేతనాలు చెల్లిస్తుండగా, తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం రూ.480 మాత్రమే చెల్లించడమన్నది తీవ్రమైన శ్రమ దోపిడీని సూచిస్తోందని విమర్శించారు.గత 12 ఏళ్లుగా కనీస వేతనాల చట్టానికి సవరణ జరగక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందన్నారు. ఇది 1975 నాటికి పరిశ్రమల జాతీయీకరణకు ముందు జరిగిన శ్రమదోపిడీని తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు సంస్థ ఉత్పత్తి, లాభాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నందున, వార్షిక బోనస్, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయాలు, వార్షిక సెలవులు, గ్రాట్యూటీ, ఇతర సామాజిక భద్రతల విధానాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లకు మరమ్మతులు చేసి, అవి ఔట్ సోర్సింగ్ కార్మికులకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొగిలిపాక రవి, ఉట్ల గణేశ్, సంగం చంద్ర, రాజమౌళి, అలీ ప్రకాశ్, శ్యామ్లాల్, ఇనపనూరి నాగేశ్వరరావు, రాకేశ్, సింగారి శ్రీనివాస్, వీరవసంత్, కొండేటి నరసయ్య పాల్గొన్నారు.



## బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలి

**●యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి**

**టీ మీడియా, జులై 31,కామేపల్లి :** యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని ముచ్చర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన కామేశ్వరరావు పదవీ విరమణ సన్మాన సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తాము పనిచేసిన చోట విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజల మన్ననలను పొందాలన్నారు.పదవీ విరమణ పొందిన కామేశ్వరరావు పాఠశాలకు అందించిన సేవలను కొనియాడారు. ప్రభుత్వం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటియాఫ్ జిల్లా నాయకులు వట్టికొండ శ్రీనివాస రావు, యం.నరసింహారావు, రమాదేవి, పద్మ, మధుసూదన్ రావు, కామేపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు నల్లమోతు శ్రీనివాసరావు, జక్కుల వెంకటేశ్వర్లు, యస్.వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




## మట్టి అమ్ముకుంటే కఠిన చర్యలు

**-తహసీల్దార్ రమేష్**

**టీ మీడియా, జులై 31,కారేపల్లి :** ఇందిరమ్మ ఇండ్ల పేరు చెప్పి మట్టి ఇతరులకు అమ్ముకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఖమ్మం జిల్లా సింగరేణి మండల తహసీల్దార్ రమేష్ హెచ్చరించారు. ఖమ్మం జిల్లా కారేపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో అనేకచోట్ల అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పేరు చెప్పి బయట మట్టిని అమ్ముకుంటున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు కూడా మట్టి తవ్వకాలు జరిపేందుకు అధికారికంగా ఎటువంటి అనుమతులు లేవని తేల్చి చెప్పారు. మండలంలో ఎక్కడైనా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతే స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నట్టు తెలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

## మోడల్ స్కూల్‌ను పరిశీలించిన ఎంపీడీవో

**-విద్యార్థులతో భోజనం**

**మౌలిక సదుపాయాలపై సంతృప్తి**



**టీ మీడియా,జులై31,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) మల్లెల రవీంద్ర ప్రసాద్ ఈరోజు సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించిన ఆయన, విద్యార్థినీ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను సుదీర్ఘంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, స్టాక్ గోదాము, వంటశాల, పాత్రల శుభ్రత వంటి అంశాలను పరిక్షించి, అవసరమైన సూచనలు చేశారు. ప్రతి రోజు విద్యార్థులకు సముచితమైన, శుభ్రతతో కూడిన భోజనం అందుతోందా అనే విషయంపై నేరుగా విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఎటువంటి అనారోగ్యాలకు గురవుతున్నారా? జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? అనే విషయాలను వివరంగా తెలుసుకునేందుకు వారి ఆరోగ్య పరిస్థితులపై ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు మరింత క్రమశిక్షణతో చదువుకోవాలంటూ ప్రోత్సాహమిచ్చారు.అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని, తరగతుల్లో బోధన పద్ధతులను, విద్యార్థుల హాజరును కూడా పరిశీలించారు. పాఠశాలలో ఉన్న కిచెన్ షెడ్, స్టాక్ రూమ్, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులపై ఎంపీడీవో పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూసీ నరేందర్ రావు పాఠశాల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## రెగ్యూలర్ ప్రొఫెసర్లను నియమించాలని ఆందోళన

**టీ మీడియా, జులై 31ఖమ్మం రూరల్:** పాలేరు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో రెగ్యూలర్ ప్రొఫెసర్లను తక్షణం నియమించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా నాయకులు స్టాలిన్, శ్రీను మాట్లాడుతూ.. ద్యార్థి ఉద్యమలు ద్వారా సాధించిన ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజికి మూడేళ్లవుతున్నా ఎలాంటి వసతులు, పక్కా భవనాలు నిర్మించలేదన్నారు. ఫ్యాకల్టీ సైతం తాత్కాలిక పద్ధతిలోనే విద్యాబోధన చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించాలని, తాత్కా లిక ఇంజినీరింగ్ కాలేజీ భవనాన్ని పూరిస్థాయి వసతులున్న భవనంగా తీర్చిదిద్దాలన్నారు.పాలేరు జేఎన్‌టీయూకు సరైన భవనాలు నిర్మాణం చేయకుండానే ఐటీడీఏకు చెందిన బిల్డింగ్ భవనంలోనే హాస్టల్, కాలేజీ తరగతుల నిర్వహిస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. ముఖ్యంగా విద్యార్థినులకు హాస్టల్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాలేజీ ఒకచోట, హాస్టల్ మరోకచోట ఉండడంతో సరైన రక్షణ లేక భయం భయంగా కాలేజీకి వెళ్తున్న పరిస్థితి ఉందన్నారు. జేఎన్‌టీయూ పాలక మండలి నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. కావునా తక్షణమే ప్రభుత్వం, జిల్లా మంత్రులు స్పందించి కాలేజీ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అలేఖ్య, అఖిల, స్పందన, కావ్య, అలేఖ్య పాల్గొన్నారు.

## చేతులు శుభ్రం ,ఆరోగ్యానికి భద్రం

**టీ మీడియా, జులై 31,మధిర :** మండలం తొండల గోపవరం గ్రామ పంచాయతి పరిధిలో గల తొర్లపాడు ప్రైమరి స్కూల్ నందు పిల్లలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బానోత్ కళావతి భాయ్ ఆదేశాలు మేరకు పీహెచ్ సీ దెందుకూరు వైద్యులు డాక్టర్ పృథ్వీ రాజ్ నాయక్ ఆధ్వర్యంలో పారా మెడికల్ సిబ్బంది గురువారం ఉదయం ఫీల్డ్ విజిట్ లో భాగంగా విద్యార్థిని – విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత లో భాగంగా చేతులు శుభ్రం –ఆరోగ్యానికి భద్రం అంటూ హ్యాండ్ వాష్ గురించి డెమోనిస్ట్రేషన్ చేసి చూపించారు.ఈ సందర్భంగా హెల్త్ సూపర్ వైజర్ లంకా కొండయ్య పిల్లలకు సంపూర్ణముగా ఆరోగ్య విద్య వారికీ అర్థం ఐయ్యే విధంగా వివరించి డెటాల్ హ్యాండ్ వాష్ తో చేతులు భోజనం పదార్ధాలు తినే ముందు ఎలా శుభ్రం చేసుకోవాలో వివరించారు. చిరు వ్యాదులకు తగిన మందులు స్కూల్ ఉపాధ్యాయుల వద్ద ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ గోపి చంద్, ఎఎన్ఎమ్ భారతి, ఆశ కార్యకర్తవిజయమ్మ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి జ్వరాల సర్వే చేసినారు. పారి శుద్యం గురించి ప్రజలకు సంపూర్ణముగా వివరించారు.





## లిఫ్ట్ మరమ్మతులు వెంటనే చేపట్టాలి

**మడుపల్లి గోపాల్‌రావు**

**టీ మీడియా, జులై 31,మధిర:** కట్టలేరుపై ఏర్పాటు చేసిన లిఫ్ట్‌కు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకువస్తే 400 ఎకరాలు సాగు అవుతుందని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు అన్నారు. గురువారం మండలంలోని తొర్లపాడు గ్రామంలో కట్టలేరుపై ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను రైతుల విజ్ఞప్తి మేరకు సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడుతూ.. తొర్లపాడు గ్రామంలోని కట్టలేరుపై నాటి కమ్యూనిస్టు ఉద్యమ నేత నల్లమల గిరి ప్రసాద్ సహకారంతో లిఫ్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తర్వాత కాలంలో ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురై లిఫ్ట్ మోటర్లు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫారాలు, పైపులు, లిఫ్ట్ కాల్వలు అన్ని నిరుపయోగంగా మారాయన్నారు. లిఫ్ట్ కోసం కట్టలేరుపై చెక్ డాం నిర్మించిన ప్రభుత్వం నీటిని రైతులకు అందించడంలో విఫలమైందన్నారు.లిఫ్ట్‌కు అవసరమైన పరికరాలు సమకూర్చడం, రిపేర్లు చేయించడంలో అధికారులు కానీ, ప్రభుత్వం గానీ ఆసక్తి చూపలేదన్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన చెక్ డాం నిరుపయోగంగా మారిందని, చెక్ డాం పూడికతో నిండిపోయి రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అధికారులు వెంటనే రిపేర్లు చేయించి రైతులకు రెండు పంటలు పండించుకునేందుకు నీళ్ల అందించాలని స్థానిక రైతులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శీలం నర్సింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు, డివిజన్ నాయకులు పాపినేని రామ నరసయ్య, ఎర్రుపాలెం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, గ్రామ నాయకుడు మద్దాల ఏబు, రైతులు సూర్య ప్రకాష్ రెడ్డి, వీరారెడ్డి, కాశిబోయిన శ్రీనివాసరావు, మధవరావు, గోపి, శీరం రమేశ్, అక్షయ్, గంజినబోయిన శివ పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణం తనిఖీ

**టీ మీడియా, జులై 31, ముదిగొండ::.** వనంవారికిష్టాపురం లో (తెలంగాణ ఆగ్రోస్ ఫెర్టిలైజర్) ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారిణి సరిత, ఎస్సై గుమ్మడి హరితతో కలిసి గురువారం సందర్శించారు.షాపులోకి నల్లగొండ నుండి దిగుమతి చేసుకున్న ఫెర్టిలైజర్ను అనుమతు లేకుండా విక్రయాలు చేస్తున్నారని స్థానికులు జిల్లా, డివిజన్ వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు మేరకు ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి,స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు.అనుమతు లేకుండా విక్రయాలు చేస్తున్న ఫెర్టిలైజర్స్ సీజ్ చేసిన ఏఓ సరిత.అనుమతి లేకుండా ఫర్టిలైజర్ను విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎరువుల దుకాణం డీలర్ను హెచ్చరించిన ఏఓ సరిత.

## సమాచార హక్కు చట్టం

ఉంచకపోవడం వల్ల రాష్ట్రంలో 18 వేల కేసులు సమాచార హక్కు చట్టం కమిషనర్ దగ్గర పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఆగస్టు నెలలో పెండింగ్లో ఉన్న కేసులను పూర్తిగా పరిష్కరించి కొత్త దరఖాస్తుల ద్వారా ముందుకు వెళ్ళబోతున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అన్ని శాఖల అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించే విధంగా సమావేశాలు మరియు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి పరిస్థితుల్లో నైనా సమాచారం కావాలని దరఖాస్తు చేసుకున్నప్పుడు నిబంధనలకు లోబడి సమాచారం అందించే విధంగా అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామని వివరించారు. సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవోలు మధు, దామోదర్, అన్ని శాఖల పౌర సమాచార అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

